సంపుటి :02 సంచిక :146 పేజీలు :04
వెల ₹5
# అక్షర దర్బార్
www.aksharadarbar.com Voice of the people
మంగళవారం 29, జూలై 2025

"అక్షర దర్బార్"
... ఇప్పుడు ప్రతి క్లిక్ వెనక ఓ సత్యం ఉంది.
స్కాన్ చేయండి!

## 31 నుంచి రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్





# బీసీ కోటా.. పోరుబాట



## 'హస్తిన'లో హస్తం నేతల పాగా

- రెండు బీసీ బిల్లులు ఆమోదానికి బీజేపీపై ఒత్తిడి
- మూడు రోజుల కార్యాచరణ అమలు
- సీఎం రేవంత్, మంత్రుల, ఎమ్మెల్యేల నిరసన
- 5వ తేదీన కాంగ్రెస్ ఎంపీలతో పార్లమెంట్లో వాయిదా తీర్మానం
- 6న జంతర్ మంతర్ వద్ద బీసీ నేతలతో కలిసి ధర్నా
- 7న రాష్ట్రపతి ద్రౌపదికి వినతిపత్రం

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితిని తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉండటం, హైకోర్టు విధించిన గడువు సమీపిస్తుండటంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఢిల్లీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆగస్టు 5 నుండి 7 వరకు మూడు రోజుల పాటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, బీసీ రిజర్వేషన్ల సమస్యను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పర్యటనలో నిరసన ప్రదర్శనలు, రాష్ట్రపతితో భేటీ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

- అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి

## వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం

- ఖమ్మం కమలం పార్టీ అడ్డాగా మారుతున్నది
- కమ్యూనిస్టుల పార్టీలు ప్రభావాన్ని కోల్పోయాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

## పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

02

- ఎలుకల మందు తాగిన బాలుడు
- మానుకోట జిల్లా తొర్రూరులో ఘటన

## సాగర్ నుంచి కృష్ణమ్మ పరవళ్లు

18 ఏళ్ల తర్వాత, ఈ ఏడాది నెల ముందుగానే నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యానికి చేరువగా 586.60 అడుగుల నీటిమట్టంతో నిండుకుండలా మారింది. మంగళవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ దృశ్యం రైతుల ఆశలకు కొత్త జీవం పోసింది.

– అక్షర దర్బార్, నాగార్జున సాగర్


02



## దండకారణ్యంలో మళ్లీ తుపాకుల మోత

- ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు
- సుక్మా జిల్లాలో ఘటన

02



## డాక్టర్లు అందుబాటులో ఉండాలి

- కాపులకనపర్తి పీహెచ్సీని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- వైద్యులు, ఏఎన్ఎం విధులకు ఆలస్యంగా రావడంపై ఆగ్రహం
- నెక్కొండ హైస్కూల్ లో మిడ్ డే మీల్స్ అమలు తీరుపైనా సీరియస్



# ‘సాగర్’ నుంచి కృష్ణమ్మ పరవళ్లు

## 18 ఏళ్ల తర్వాత నెల ముందే విడుదల



అక్షరదర్బార్, నాగార్జునసాగర్: ఎగువ నుంచి వస్తున్న వర్షాలకు కృష్ణా నది ఉప్పొంగి ప్రవహిస్తున్నది. కొండ కోనల నుంచి భారీగా నదిలోకి వరద చేరుతున్నది. దీంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 590.00 అడుగులకు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 586.60 అడుగులకు చేరింది. మంగళవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. 18 ఏళ్ల తర్వాత.. నెల ముందుగానే నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి. ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో.. దిగువ భాగంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం. సాగర్‌కు నెహ్రూ పునాది వేస్తే.. ఇందిరాగాంధీ ప్రారంభించారు. 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే గొప్ప ప్రాజెక్టు ఇదని కొనియాడారు.



# బీసీ కోటా.. పోరుబాట




## ‘హస్తిన’లో హస్తం నేతల పాగా

- రెండు బీసీ బిల్లులు ఆమోదానికి బీజేపీపై ఒత్తిడి
- మూడు రోజుల కార్యాచరణ అమలు
- సీఎం రేవంత్, మంత్రుల, ఎమ్మెల్యేల నిరసన
- 5వ తేదీన కాంగ్రెస్ ఎంపీలతో పార్లమెంట్లో వాయిదా తీర్మానం
- 6న జంతర్ మంతర్ వద్ద బీసీ నేతలతో కలిసి ధర్నా
- 7న రాష్ట్రపతి ద్రౌపదికి వినతిపత్రం

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితిపై గత నెల హైకోర్టు కీలకమైన తీర్పునిచ్చింది. సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వంతో పాటు ఎన్నికల కమిషన్ కు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ప్రభుత్వ తరఫున న్యాయవాదులు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు 30 రోజుల గడువు, అలాగే ఎన్నికల నిర్వహణకు మరో 60 రోజులు గడువు కావాలని న్యాయస్థానాన్ని కోరారు. దీనికి కోర్టు అంగీకారం తెలిపింది. దీంతో గరిష్ఠంగా 90 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై పడింది. న్యాయస్థానం తీర్పు ప్రకారం ఇప్పటికే ప్రభుత్వం రిజర్వేషన్లను తేల్చాల్సి ఉంది. కానీ, గడువు పూర్తవుతున్నా సాంకేతిక సమస్యల కారణంగా ఆ పని పూర్తి కాలేదు. ప్రభుత్వం ఇప్పటికే బీసీ రిజర్వేషన్లపై రెండు బిల్లలను అసెంబ్లీలో ఆమోదింపజేసి రాష్ట్రపతి అమోదానికి పంపింది. ప్రస్తుతం ఆ బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. మరోవైపు 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పంచాయతీ రాజ్ చట్టం 2018ని సవరణ చేయాలని, ఆ ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు సాధించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెంతకు ముసాయిదాను పంపించింది. గవర్నర్ ఆ ముసాయిదాను న్యాయ సలహా కోసం ఢిల్లీలోని అటార్నీ జనరల్కు పంపించారు. ఇది ఇలా ఉండగా, సోమవారం సీఎం రేవంత్రెడ్డి క్యాబినేట్ సమావేశం నిర్వహించి కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని ఢిల్లీలోనే తేల్చుకోవాలని నిర్ణయించారు. మూడు రోజుల పాటు అక్కడే పాగా వేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, చివరి రోజు రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును కలిసి సమస్యను తెలపాలని ప్రణాళిక రచించారు.

**- ప్రణాళిక ఇలా..**

వచ్చే నెల 5, 6, 7వ తేదీల్లో సీఎం రేవంత్రెడ్డితో పాటు మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఢిల్లీలో ఉంటారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆగస్టు 5న బీసీ రిజర్వేషన్ బిల్లుల ఆమోదంలో జాప్యానికి నిరసనగా పార్టీ ఎంపీల ద్వారా వాయిదా తీర్మానం ఇప్పించాలని డిమాండ్ చేస్తారు. 6న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి జంతర్‌మంతర్ వద్ద కేంద్ర ప్రభుత్వ నిర్లిప్త వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. 7న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి బిల్లుల ఆమోదం కోసం వినతిపత్రం అందిస్తారు. అప్పటికీ సానుకూల స్పందన రాకుంటే కాంగ్రెస్ ఎంపీలతో ఇండియా కూటమి ఎంపీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేసేందుకు సీఎం, మంత్రులు సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలనే సంకల్పంతోనే ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని, కానీ, కేంద్రంలోని బీజేపీ మోకాలడ్డుతున్నదని ఇప్పటికే సీఎం రేవంత్ అనేకసార్లు ఆరోపించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ సీఎం, లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలు అడుగుతున్నారని, మూడు రోజుల కార్యక్రమానికి రాష్ట్రం నుంచి మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. బీసీ సంఘాల సభ్యులు, మేధావులు, రిజర్వేషన్లు కోరుకుంటున్నవారంతా రావాలని విజ్ఞప్తి చేశారు.

**- మార్చిలోనే రెండు బిల్లులకు ఆమోదం..**

ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదింప చేసిన రెండు బీసీ బిల్లులను మార్చి 22న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపించగా, వాటిని రాష్ట్రపతి ఆమోదం కోసం ఇదే మార్చి 30న పంపించారు. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు, రాష్ట్రపతి సకాలంలో నిర్ణయాలు తీసుకోవాలన్న సుప్రీంకోర్టు, మద్రాస్ హైకోర్టు తీర్పులను పరిశీలిస్తున్నట్లు ప్రస్తుతం ప్రభుత్వం చెబుతోంది. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవని, తెలంగాణ ఏర్పాటైన తరువాత అప్పటి సీఎం కేసీఆర్ 2018 పంచాయతీ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతంలోపు ఉండాలన్న నిబంధన చేర్చారని గుర్తు చేస్తున్నది. దాన్ని సవరిస్తూ 50 శాతం పరిమితిని ఎత్తివేస్తూ జులై 10న ఆర్డినెన్సు ముసాయిదా జారీ చేసింది. ఆ ముసాయిదా ఈనెల 14న గవర్నర్కు చేరింది. అది కాస్త తర్వాత న్యాయసలహాకు వెళ్లింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు హైకోర్టు గడువు ముంచుకొస్తున్నది. ఈ సందర్భంలో కేంద్రం జోక్యం చేసుకుని బిల్లులను ఆమోదింపజేయాలనే లక్ష్యంతో సీఎం, మంత్రులు ముందుకు వెళ్తున్నారు.

**- బీజేపీపై ఒత్తిడి..**

కేంద్రంతో రెండు బీసీ బిల్లులు ఆమోదింపజేసేందుకు బీజేపీ కార్యకర్తలతో పాటు ఆ పార్టీకి చెందిన బీసీ ఎంపీలు అర్వింద్, బండి సంజయ్, ఈటల రాజేందర్, ఆర్.కృష్ణయ్య, లక్ష్మణ్ చొరవ తీసుకోవాలని సీఎం రేవంత్రెడ్డి, మంత్రులు కోరుతున్నారు. మరోవైపు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్రావు వ్యవహార శైలిపైనా విమర్శలు గుప్పిస్తున్నారు. శాసనసభలో రెండు బిల్లులకు సహకరించిన బీజేపీ, ఇప్పుడు కాదంటోందని మండిపడుతున్నారు. బిల్లులకు సహకరించేందుకు వీలుకాకుంటే రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు రెండు బిల్లలకు రాష్ట్రపతి ఆమోదం తెలపకపోతే పరిస్థితి ఏంటనే ప్రశ్న ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై 90 రోజుల్లోపు ఏదో ఒక నిర్ణయం వెలువరించకపోతే ఆమోదం తెలిపినట్లుగానే భావించాల్సి ఉంటుందని ఇటీవల తమిళనాడుకు సంబంధించిన బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెరమీదకు వస్తున్నది. అయితే, అది ఆ కేసు వరకే పరిమితమన్న అంశం తీర్పులో ఉందని అధికారులు చెప్పినట్లు తెలిసింది. న్యాయశాఖ అధికారులు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. అసెంబ్లీలో ఆమోదించిన బీసీ రిజర్వేషన్ బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండటం, తాజాగా ఆర్డినెన్స్ ముసాయిదాను కూడా గవర్నర్ పంపినట్లు సమాచారం అందడంతో సీఎం, మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా ఢిల్లీకి వెళ్లి ఒత్తిడి తేవాలని నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



# ఉత్తమ్‌పై అలిగిన కోమటిరెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మరో మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నాగార్జున సాగర్ డ్యాం గేట్లు ఎత్తడానికి మంగళవారం హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, జిల్లా ఇంఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బయలుదేరాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటలకే ఎయిర్‌పోర్టుకు కోమటిరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ చేరుకున్నారు. 10 గంటలైనా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేరుకోలేదు. దీంతో కోమటిరెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో కోమటిరెడ్డి విమానాశ్రయం నుంచి ఆయన అలిగి వెళ్లిపోయినట్లు సమాచారం. కొద్దిసేపటికి ఎయిర్‌పోర్టు చేరుకున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి నాగార్జున సాగర్ బయల్దేరి వెళ్లారు. అక్కడ సాగర్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ క్రమంలోనే మంత్రి కోమటిరెడ్డి తన రెండు ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకున్నట్లు సమాచారం.

# పదోతరగతి విద్యార్థి ఆత్మహత్య

## ఎలుకల మందు తాగిన బాలుడు

## మానుకోట జిల్లా తొర్రూరులో ఘటన

అక్షరదర్బార్, తొర్రూరు: ఎలుకల మందు తాగి పదవ తరగతి విద్యార్థి ఆత్మహత్య ప్రయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మర్రికుంట తండాకు చెందిన బానోత్ వెంకన్న, అనిత దంపతుల కుమారుడు వెంకటచైతన్య(15) తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పాఠశాల హాస్టల్‌లో ఎలుకల మందు తాగాడు. యాజమాన్యం వెంటనే బాలుడిని వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించింది. పరిస్థితి విషమించడంతో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి విద్యార్థి మృతి చెందాడు. తమ కుమారుడి మృతికి స్కూల్ యాజమాన్యమే కారణమని ఆరోపిస్తూ న్యాయం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్ఐ ఉపేందర్ తెలిపారు.

# ఛత్తీస్ గఢ్ లో ఎదురుకాల్పులు

## సుక్మా జిల్లాలో ఘటన

అక్షరదర్బార్, కొత్తగూడెం: కొంత కాలం నుంచి స్తబ్ధుగా ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మళ్లీ తుపాకుల మోత మోగింది. సుక్మా జిల్లాలో మంగళవారం పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఒకవైపు మావోయిస్టులు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తుండగా ఎదురు కాల్పులు చోటుచేసుకోవడం కలకలం రేపింది. ఈ ఎదురు కాల్పుల్లో డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గార్డ్స్ (డీఆర్‌జీ), సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ బృందాలు పాల్గొన్నట్టు తెలిసింది. ఉదయం నుంచి కాల్పులు కొనసాగుతున్నట్లు సమాచారం. అయితే.. ఎదురుకాల్పులపై ఛత్తీస్‌గఢ్ పోలీసుల నుంచి అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉన్నది.



## సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు




అక్షర దర్బార్, (నూగూరు ) వెంకటాపురం : వెంకటాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముత్యం రమేష్ ను తెలంగాణ రాష్ట్ర వాడ బలిజ సేవా సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్ర దామోదర్, అధికార ప్రతినిధి తోట మల్లికార్జునరావు, ఉపాధ్యక్షులు గగ్గూరి రమణయ్య, రాష్ట్ర నాయకులు అల్లి సూరిబాబు, సీనియర్ నాయకులు అల్లి నాగేశ్వరరావు యువ నాయకులు కొక్కురు ముత్యాలరావు, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు గగ్గూరి రమేష్, వెంకటాపురం మండల అధ్యక్షులు బొల్లె సునీల్, వాజేడు మండల అధ్యక్షులు గార నాగార్జున, వాజేడు మండల అధికార ప్రతినిధి బొల్లె ఆదినారాయణ నాయకులు ఎర్రాల కన్నయ్య, దర్ర గోపి, తోట సతీష్, కొప్పుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి మహాదివ్య పడిపూజ



అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి మహాదివ్య పడిపూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు.అయ్యప్పస్వామి ఉత్తర నక్షత్ర జాతకంతో జన్మించిన నేపథ్యంలో ప్రతీ నెల వచ్చే ఉత్తర నక్షత్ర గడియలు వస్తున్న తరుణంలో నర్సంపేట శ్రీ ధర్మ శాస్త్ర దేవాలయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత ఐదు నెలలుగా ప్రత్యేక పడిపూజలు నిర్వహిస్తున్నారు. దేవాలయ ట్రస్టు చైర్మన్ సింగిరికొండ మాధవశంకర్ గుప్తా, అధ్యక్షుడు సైపా సురేష్ ఆధ్వర్యంలో దేవాలయంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. సందర్భంగా అయ్యప్పస్వామికి నెయ్యి, తేనే,చక్కర,పంచాంతృతం,గంధం, విభూదితో అష్టాభిషేకాలు,కలశాభిషేకాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దొడ్డ రవీందర్ గుప్తా,దోమకుంట్ల నందయ్య గురుస్వామి, శ్రీరాం ఈశ్వరయ్య ఇరుకుల్ల వీరలింగం,భూపతి లక్ష్మీనారాయణ,బండారుపల్లి చెంచారావు,పాలకుర్తి శ్రీనివాస్,వజినపెల్లి శ్రీనివాస్,దొడ్డ వేణు,అనంతుల రాంనారాయణ, మల్యాల రాజు,మల్యాల ప్రవీణ్,భీరం నాగిరెడ్డి,రాం చందర్,కర్ణాకర్,మండల వీరస్వామి గౌడ్,బాదం అనిల్,శ్రీనివాస్, శ్రీరాం కిరణ్,గురుస్వాములు సంజీవ రావు,బొట్ల నాగరాజు, యాదగిరి,అనిల్,ఆలయ గుమస్తా దేశి రాము అర్చకులు ఫ్రాన్స్,శివాంకిత్,ఆనంద్,తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



### తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలి



అక్షర దర్బార్, చిట్యాల : ఎస్సీ కులం పేరు న తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకుంటున్న వారిపై చర్య తీసుకుని జారీ అయిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను తక్షణం రద్దు చేయాలని కోరుతూ మంగళ వారం చిట్యాల మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో చిట్యాల తహసీల్దార్ కి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్న బాలసంత కాటిపాపల కులస్తులకు బేడ బుడగ జంగమాని తప్పుగా చెప్పి ఎస్సీ కులం సర్టిఫికెట్ తీసుకుంటున్నారని వాటిని రద్దు చేయాలని సంబంధించిన జిల్లా మండల అధికారులను కోరుతున్నామన్నారు. బాలసంత కాటిపాపల కులస్తులకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వద్దని చల్లగరిగే ముసినిపర్తి, చిట్యాల గ్రామాల నుండి దళితులు వచ్చి చిట్యాల తహసీల్దార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఇతర కులాలకు చెందిన వారు మేమే బెడ బుడగ జంగం అని మాకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వమని ఎవరైన అప్లికేషన్ పెట్టిన కూడా వారు గతంలో ఏ పాఠశాలలో చదువుకున్నటువంటి అడ్మిషన్ రిజిస్టర్లు ఎంక్వయిరీ చేసి వారికి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య (ఎమ్మార్పీఎస్) మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు జేరిపోతుల ఓదెలు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు దూడపాక సాంబయ్య డిఎస్పి నాయకులు పుల్ల అశోకు చల్లగరియా ముచి నీపర్తి గ్రామాల చెందిన దళిత సంఘాల నాయకులు సోమిడిరఘుపతి దూడపాక దివాకరు నోముల శివశంకరు సిరి పెల్లి నరేష్ కొల్లూరి అశోకు దూడపక రాజు తదితరులు పాల్గొన్నారు.

### పిల్లల సంరక్షణ కోసం అవగాహన

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం చల్లగరిగా గ్రామంలో మంగళవారం జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి ఆదేశానుసారం చల్లగరిగా అంగన్వాడి సెంటర్, జెడ్ పి హెచ్ ఎస్ లో సూపర్వైజర్ జయప్రద ఆధ్వర్యంలో(ఉమెన్ హబ్) మహిళా సాధికారత కేంద్ర సిబ్బంది అనూష, మమతలు పిల్లల రక్షణ తీసుకోవలసిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత ఇంచార్జ్ డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ శ్రీమతి అనూష మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లల రక్షణ విద్య కోసం బేటి బచావో బేటి పడావో పథకం ప్రారంభించారని , సేఫ్ టచ్- అన్ సేఫ్ టచ్, అక్రమ రవాణా, బాల్య వివాహ నిషేధ చట్టం, మొబైల్ వాడటం వల్ల జరిగే నష్టాల గురించి అదేవిధంగా ఆడపిల్లలపై లైంగిక వేధింపులు రోజురోజుకి ఎక్కువ అవుతున్నాయని సోషల్ మీడియా పట్ల జాగ్రత్త ఉండాలని వాట్సప్ ఇన్స్టాగ్రామ్ లో ఫోటోస్ పెట్టడం వల్ల సైబర్ నేరగాళ్లు ఫోటో మార్ఫింగ్ చేస్తారని తెలిపారు కావున జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మహిళలు ఆపద సమయంలో ఉమెన్ హెల్ప్ లైన్ 181 ,వృద్ధులు14567 ,సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఉపయోగించుకోవాలని తెలిపారు. సూపర్వైజర్ జయప్రద మాట్లాడుతూ పోషకార ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో డీహెచ్ ఈ డబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ మమత, హై స్కూల్ టీచర్లు శ్రీదేవి, రజిత, అంగన్వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.



# భూభారతి దరఖాస్తులు పెండింగ్ పెట్టొద్దు

- వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) సంధ్యారాణి
- దుగ్గొండిలో భూభారతి దరఖాస్తుల పురోగతిపై సమీక్ష



అక్షర దర్బార్, దుగ్గొండి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో పెట్టకుండా పరిష్కారిచాలని వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) సంధ్యారాణి మండల రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం దుగ్గొండి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాల వారీగా భూభారతిలో వచ్చినా దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి లో వచ్చిన మొత్తం దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆగస్టు 10వ, తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల పట్ల సిబ్బంది అలసత్వం వహించకుండా సమయపాలన పాటించాలన్నారు. వీధిలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ రాజేశ్వరరావు, నాయక్ తహసీల్దార్ ఉమారాణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

- వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి
- గిర్నిబావి ఎంజేపీ గురుకులం ఆకస్మిక తనిఖీ

అక్షర దర్బార్, దుగ్గొండి : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన సూచి రుచికరమైన భోజనాన్ని అందించాలని వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం దుగ్గొండి మండలం గిర్నీబావిలోని మహాత్మ జ్యోతి బా పూలే బాలుర బీసీ గురుకుల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా. అడిషనల్ కలెక్టర్ ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న వసతులను, సౌకర్యాలు పరిశీలించారు. పాఠశాల ఆవరణమంతా పర్యవేక్షిస్తూ విద్యార్థులకు అందిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా, ప్రతిరోజు ఎలా ఉందని తెలుసుకోగా విద్యార్థులు అన్ని వసతులు బాగున్నాయని చెప్పడంతో వంటగదిని పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల విద్యార్థులకు కల్పిస్తున్న వసతుల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య, ఏటీపీ సతీష్, డిప్యూటీ వార్డెన్ సమత, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- లీడ్ బ్యాంకు జిల్లా అధికారి ఆవేలి రాజు
- అడవి రంగాపురంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు



అక్షరదర్బార్, దుగ్గొండి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని రకాల పథకాలను అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంకు జిల్లా అధికారి ఆవేలి రాజు గ్రామస్తులకు సూచించారు. మంగళవారం మండలంలోని అడవి రంగాపురం గ్రామంలో కొమ్మల యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆఫీస్ ఆవరణలో బ్యాంకులో జరిగే వివిధ రకాల కార్యక్రమాలపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా లీడ్ బ్యాంకు జిల్లా అధికారి ఆవేలి రాజు హాజరై మాట్లాడుతూ బ్యాంకులో అమలవుతున్న బీమా పథకాలైన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకంలో 18నుంచి 50 సంవత్సరాలు ఉన్నవారు చేరి సంవత్సరానికి 436 /-రూ. చెల్లిస్తే సహజ మరణం చెందితే రెండు లక్షల రూపాయలు వస్తాయన్నారు.ప్రధానమంత్రి జీవన్ సురక్ష పథకంలో 18నుంచి 70 సంవత్సరాల వారు రూ.20 చెల్లించి ప్రమాద మరణం చెందితే నామినీకి రెండు లక్షల రూపాయలు బ్యాంకు చెల్లిస్తదనీ తెలిపారు. బ్యాంకు లో అటల్ పెన్షన్ సౌకర్యం, ఆడపిల్లలకు సుకన్య జీవన పథకంలో చేరాలన్నారు. బ్యాంకు వినియోగదారులు తీసుకున్న రుణాలను రెగ్యులర్గా సమయానికి చెల్లించాలని కోరారు. రెగ్యులర్ గా చెల్లించిన వారి సివిల్ స్కోర్ బాగా ఉంటుందన్నారు. సివిల్ స్కోర్ బాగా ఉంటే ఇతర రుణాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రుణాలు కావలసిన వారు బ్యాంకును సంప్రదించాలని కోరారు. కొమ్మల యూనియన్ బ్యాంక్ మేనేజర్ సర్వేశ్వరరావు మాట్లాడుతూ పంట రుణం తీసుకున్న రైతులు ప్రతి సంవత్సరం రెగ్యులర్ గా కట్టుకొని తిరిగి రుణం పొందాలని కోరారు. రెగ్యులర్గా కట్టుకున్న వారికి ప్రభుత్వం రుణమాఫీ ఇస్తే వర్తిస్తుందన్నారు. జిల్లా ఫైనాన్స్ లిటరసీ కోఆర్డినేటర్ తోగిటి భాస్కర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడద్దని కస్టమర్లను కోరారు. మీ ఫోనుకు ఓటీపీ నెంబర్ వచ్చింది మేము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాము అని మాట్లాడితే ఓటీపీ నెంబర్ చెప్పొదన్నారు. బ్యాంకు నుంచి ఎవరు ఓటీపీ నెంబర్ చెప్పమని అడగరు. ఒకవేళ ఓటిపి నెంబర్ చెప్తే మీ బ్యాంక్ అకౌంట్ లో ఉన్న డబ్బులు సైబర్ నేరగాళ్లు దొంగిలిస్తారని చెప్పారు. కావున కస్టమర్లు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండం విజేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సింగతి కిరణ్, కొమ్మల యూనియన్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్ తొగిటి బ్రహ్మచారి, శ్రీకాంత్, బ్యాంకు మిత్ర అనురాధ, గీసుకొండ మండలం ఫైనాన్స్ లిటరసీ కోఆర్డినేటర్లు శ్రీకాంత్,రాజేష్, మౌనిక, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అన్ని వార్డుల అభివృద్ధికి కృషి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అక్షర దర్బార్, భూపాలపల్లి, జూలై 29: భూపాలపల్లి మున్సిపాలిటీలోని 30 వార్డుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. 20, 21 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాలయ్యపల్లికి చెందిన 10 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందజేశారు.

# "శభాష్ చిల్డ్రన్స్!"

## క్రీడా పాఠశాలకు ఎంపికైన వారిని అభినందించిన కలెక్టర్



అక్షర దర్బార్, కాటారం, జూలై 29: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలకు ఎంపికైన కాళేశ్వరం గ్రామానికి చెందిన కోల శాన్వి, గంట హరిచందన, నాగుల తులసిలను కలెక్టర్ రాహుల్ శర్మ అభినందించారు. వారిని శాలువాతో సత్కరించి, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

# ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

## కలెక్టర్ స్నేహ శబరీష్



అక్షర దర్బార్, పరకాల, జూలై 29: పరకాల మండలంలో కలెక్టర్ స్నేహ శబరీష్ ఎరువుల దుకాణాలు, గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. రైతులు ఆందోళన చెందవద్దని, యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయని తెలిపారు.



www.aksharadarbar.com

# విద్యకు కాంగ్రెస్ అధిక ప్రాధాన్యత

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

అక్షర దర్బార్, చిట్యాల: ప్రతి వ్యక్తి వికాసానికి విద్యే దోహదపడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం శాంతినగర్‌లో నూతన ప్రాథమిక పాఠశాలను ప్రారంభించి, విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి, పలకలు, నోట్‌బుక్స్ అందజేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు.



# బోగస్ సర్టిఫికెట్ల తయారీ ముఠాల అరెస్టు

- పోలీసులకు చిక్కిన 15 మంది కేటుగాళ్లు. మరో ఐదుగురు పరారీ
- ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టిన నిందితులు
- వివరాలు వెల్లడించిన సెంట్రల్ జోన్ డీసీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: రెండు వేర్వేరు సంఘటనల్లో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిస్తూ బోగస్ వాహన రిజిస్ట్రేషన్, ఇన్సురెన్స్ సర్టిఫికేట్లను తయారీ చేసున్న రెండు ముఠాలకు సంబంధించి 15 మంది కేటుగాళ్లను టాస్క్ ఫోర్స్, హన్మకొండ, మీల్స్ కాలనీ, కేయూసీ పోలీసులు ఆర్టీఏ అధికారులతో కలిసి అరెస్టు చేశారు. మరో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారు. పట్టుబడిన నిందితుల నుంచి పోలీసులు 6 డెస్క్ టాప్ కంప్యూటర్లు, 2 ల్యాప్ టాప్లు, 2 థర్మల్ ప్రింటర్స్, 17 సెల్ ఫోన్లతో పాటు కంప్యూటర్ చిఫ్‌తో కూడిన పీవీసీ కార్డులు, కార్డు ప్రింటింగ్ కు అవసరమైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఎండీ ఆసిఫ్ ఖురేషి, వడ్లకొండ శ్రీనివాస్, ఎండీ నవాబ్, ఎండీ సాబీర్, మణికంటి ప్రభాకర్ రెడ్డి, గుగ్గిళ్ళ చెర్రిబాబు, కేషోజు రాజ్ కుమార్ అలియాస్ డీఎల్ రాజు, ఎండీ ఆసిఫ్, అంకం శ్రీనివాస్, గోనెల రమేష్ అలియాస్ వాగ్దేవి రమేష్, ఎన్ శశివర్ధన్, నరిశెట్టి రాజేష్, తండ దిలిప్ కుమార్, ముజ్జిగ ఓంప్రకాశ్, ముషిపట్ల అక్షయ్ కుమార్ ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం లక్ష్మమ్మ, సతీష్, వేల్పుల ప్రశాంత్, దేవులపల్లి శ్రావణ్, ఎం రాజు పరారీలో ఉన్నారు. పట్టుబడిన నిందితుల్లో అధికశాతం ఆర్టీఓ బ్రోకర్లు, వాహన కన్సల్టెన్సీ యజమానులు ఉన్నారు.

ఈ అరెస్టుకు సంబంధించి సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా మంగళవారం వివరాలను వెల్లడించారు. ఈ రెండు కేసులకు సంబంధించి హన్మకొండ పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు ప్రధాన నిందితులైన ఎండీ ఆసిఫ్ ఖురేషి, వడ్లకొండ శ్రీనివాస్ లు ఆర్టీఏ ఏజెంట్లుగా చెలామణి అవుతున్నారు. ఫైనాన్స్ ద్వారా వాహనాలు కొనుగోలు చేసి వాటి వాయిదాలు తిరిగి చెల్లించని పక్షంలో ఫైనాన్స్ సంస్థలు



స్వాధీనం చేసుకున్న వాహనాలను సదరు వాహన ఫైనాన్స్ సంస్థలు తిరిగి విక్రయించే సమయంలో తప్పనిసరిగా ఫ్రెష్ రిజిస్ట్రేషన్ కార్డు కోసం ఆర్టీఓ కార్యాలయానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. కాని వాహన ఫైనాన్స్ సంస్థలు అలా చేయకుండా స్వాధీనం చేసుకున్న వాహనాలను నేరుగా స్థానికంగా వున్న వాహన కన్సల్టెన్సీ వ్యాపారస్తులకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లతో పాటు ఒరిజినల్ వాహన రిజిస్ట్రేన్ కార్డు లేకుండా వాహనాన్ని విక్రయించేవారు. దీనితో వాహన కన్సల్టెన్సీ వ్యాపారస్తులు వాహనాలను విక్రయించేందుకు అవసరమైన ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాల కోసం ప్రధాన నిందితులను సంప్రదించేవారు. దీంతో నిందితులు కన్సల్టెన్సీ ద్వారా విక్రయించే వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్లైన్ ద్వారా సేకరించి, ఆన్లైన్ లో కొనుగొలు చేసిన పీవీసీ కార్డ్ లపై, ఆర్టీఓ కార్యాలయాల నుంచి అక్రమంగా వివిధ మార్గాల్లో సేకరించిన ఒరిజినల్ కార్డులపై థర్మల్ ప్రింటింగ్ మిషన్ ద్వారా ఒరిజినల్ తరహాలో రిజిస్ట్రేషన్ కార్డులను తయారు చేసి కన్సల్టెన్సీ వ్యాపారస్తులకు అందించడంతో కన్సల్టెన్సి వ్యాపారస్తులు వాహన ఫైనాన్స్ సంస్థల నుంచి కొనుగోలు వాహనాలను ప్రజలకు విక్రయిస్తూ బోగస్ రిజిస్ట్రేషన్ పత్రాలను ఉపయోగించి ఆన్లైన్ లో ఫ్రెష్ రిజిస్ట్రేషన్ లను ఆర్టీఏ నుంచి జారీ చేయిస్తున్నారు.

మరో సంఘటనలో కేయూసీ, మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు అరెస్టు చేసిన నిందితులందురూ ఆర్టీఏ బ్రోకర్లుగా పనిచేస్తూ ఫిట్నెస్ సర్టిఫికేట్ రెన్యూవల్ అవసరం ఉన్న వాహనాలకు, ఓనర్ షిప్ ట్రాన్స్ఫర్ సమయంలో ఆర్టీఏ నిబంధనల ప్రకారం వాహన భీమ పత్రాలు తప్పనిసరి కావటం వల్ల దానిని ఆసరాగా చేసుకొని, అవసరమైన భీమా పత్రాల కోసం ఈ ముఠా సభ్యులు ముందుగా ఒక ఓరిజినల్ భీమా పాలసీని తీసుకొని, వారికి వున్న పరిజ్ఞానంతో పాలసీపై ఉన్న వివరాలను మార్చి వాటి స్థానంలో వారికి కావల్సిన వాహన వివరాలు, కావాల్సిన పాలసీ గడువు తేదీలతో కూడిన బోగస్ వాహన పాలసీలను రూపొందించేవారు. ఈ విధంగా రూపొందించిన భీమా పత్రాలను ఆర్టీఓ కార్యాలయానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసి ఫిటెనెస్ రెన్యూవల్ సర్టిఫికెట్ పొందే విధంగా నిందితులు వాహనదారులకు సహకరిస్తూ వారి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు వసూళ్ళకు పాల్పడేవారు.

రెండు వేర్వేరు సంఘటనల్లో హన్మకొండ పోలీసులు ఆరుగురుని అరెస్టు చేయగా, మీల్స్ కాలనీ పోలీసులు ఆరుగురుని, కేయూసీ పోలీసులు మరో ముగ్గురుని అరెస్టు చేశారు. ఈ రెండు సంఘటనల్లో నిందితులు బోగస్ రిజిస్ట్రేషన్ కార్డ్స్, బోగస్ భీమా పత్రాలను అందజేయడం ద్వారా పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. అలాగే ఆర్టీఓ విభాగానికి సంబంధించి ఎవరైన ఉద్యోగులు నిందితులకు సహకరించారా అనే కోణంపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ వెల్లడించారు.

# పరకాల అభివృద్ధికి ప్రజల సహకారం

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



అక్షర దర్బార్, పరకాల, జూలై 29: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల మున్సిపల్ కార్యాలయంలో జె.సి.బి. మరియు 6 స్వచ్ఛ ఆటోలను కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి ప్రారంభించారు. మెప్మా ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్‌ను, మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనను పరిశీలించారు. పరకాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని, త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్, సెట్విన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. 461 ఇందిరమ్మ ఇళ్లను 45 రోజుల్లో నిర్మించకుంటే ప్రొసీడింగ్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ సుష్మ పనితీరును ప్రశంసించారు.

# మంత్రి ఇలాఖాలో ఇసుక మాఫియా

## బీఆర్ఎస్ యూత్ కిరణ్



అక్షర దర్బార్, కాటారం, జూలై 29: ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు సొంత మండలమైన కాటారంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే ఈ దందా నడుస్తోందని, అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారని విమర్శించారు.

# ఉపాధ్యాయులు సమస్యల సాధనకై పోరాడాలి




అక్షర దర్బార్, చిట్యాల, జూలై 29: ఆగస్టు 1న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగే ఉపాధ్యాయ ధర్నాలో అందరూ పాల్గొనాలని డి.టి.ఎఫ్. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. తిరుపతి పిలుపునిచ్చారు. పి.ఆర్.సి., పెన్షన్, పోస్టుల భర్తీ తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటం చేపడుతున్నామని తెలిపారు.

# క్రీడాకారుడిని పరామర్శించిన సోదా రామకృష్ణ

అక్షర దర్బార్, పరకాల, జూలై 29: ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న జాతీయ క్రీడాకారుడు శశాంక్ను కాంగ్రెస్ నాయకులు సోదా రామకృష్ణ పరామర్శించి, కుటుంబానికి ధైర్యం చెప్పారు.

# స్కూల్ వ్యాన్ ఢీకొని బాలిక మృతి

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్, జూలై 29: అంబటిపల్లి గ్రామంలో స్కూల్ వ్యాన్ ఢీకొని మూడు సంవత్సరాల బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హెల్మెట్ తప్పనిసరి

## ఎస్.ఐ. రణధీర్ రెడ్డి

అక్షర దర్బార్, దుగ్గొండి, జూలై 29: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని దుగ్గొండి ఎస్.ఐ. రావుల రణధీర్ రెడ్డి సూచించారు. వాహనాల తనిఖీ చేసి నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు.

# బీఆర్ఎస్ నుండి బీజేపీలోకి చేరికలు

అక్షర దర్బార్, ఖానాపురం : ధర్మారావుపేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి విజయ్ కుమార్, కుండే రమేష్ల ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

## కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షర దర్బార్, కాటారం, జూలై 29: ఇంటింటి నుండి సేకరించిన వ్యర్థాలను దహనం చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కాళేశ్వరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, వ్యర్థాల దహన వాటికను పరిశీలించారు. గోదావరి ఉధృతిని పరిశీలించి, భక్తులు నదిలోకి వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## బానోత్ దేవేందర్



అక్షర దర్బార్, కొత్తగూడ, జూలై 29: ముస్మి గ్రామపంచాయతీ పరిధిలోని కర్ణగండిలో 15 కుటుంబాలకు కాంగ్రెస్ యువ నాయకుడు బానోత్ దేవేందర్ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. రాష్ట్ర మంత్రి సీతక్క సూచనల మేరకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు అందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలను మోసం చేసిందని, కాంగ్రెస్ పార్టీ ఇళ్లను పంపిణీ చేసిందని తెలిపారు.